సాక్షి నిజామాబాద్

సోమవారం । 19 । ఆగస్టు । 2024



అనుబంధాల రాఖీ

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ. నేడు జిల్లాలో రక్షా బంధన్‌ను ఘనంగా జరుపుకోనున్నారు.

- 8లో ▸



హోరాహోరీగా టోర్నీ

నిజామాబాద్ నగరంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ హోరాహోరీగా కొనసాగుతోంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.9 /23.7

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

చేప పిల్లల ఉత్పత్తి ప్రారంభం



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల కేంద్రంలో ఆదివారం చేప పిల్లల ఉత్పత్తిని ప్రారంభించారు. సాధారణంగా జూలై మొదటి నుంచి ఆగస్టు చివరి వరకు ఉత్పత్తి చేపడుతారు. ఈ ఏడాది ఆలస్యంగా ప్రక్రియ ప్రారంభించారు. దీంతో మరో 10 రోజులు మాత్రమే ఉత్పత్తి చేసే అవకాశం ఉందని సిబ్బంది తెలిపారు. తల్లి చేపల నుంచి గుడ్డును సేకరించి, ఎకో హెచరీల్లో బాయిల్డ్ చేసి చేప పిల్లల ఉత్పత్తిని చేపడుతారు. ఆలస్యంగా ఉత్పత్తి ప్రారంభించడంతో తల్లి చేపల నుంచి నాణ్యమైన గుడ్డు రావడం లేదని సిబ్బంది చెబుతున్నారు.

నిజాంసాగర్‌లోకి 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్ : ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఆదివారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,390.33 అడుగుల(4.176 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌లో ప్రతిభ



నిజామాబాద్ నాగారం : రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన మిట్టపల్లి రిత్విక మూడు బంగారు పతకాలతో సత్తా చాటింది. తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్టిక్ ఛాంపియన్‌షిప్ స్విమ్మింగ్ పోటీలు ఆదివారం సికింద్రాబాద్‌లో జరిగినాయి. ఈ పోటీల్లో రిత్విక 50 మీటర్లు, వంద మీటర్లు, 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ పోటీల్లో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు సెప్టెంబర్ 10 నుంచి 13 వరకు కర్ణాటకలో జరగనున్నాయి. రిత్వికను రాష్ట్ర సిమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఉమేశ్, ఉపాధ్యక్షుడు మైపాల్‌రెడ్డి అభినందించారు.

ఒక చిత్రం.. ఎన్నో భావాలు

ఎన్నో భావాల కలయికకు ప్రతిబింబం.. మరెన్నో పదాలకు ప్రతిరూపం చిత్రం! అందమైనా, ఆనందమైనా, విషాదమైనా, జీవన సౌందర్యమైనా, ప్రకృతి రమణీయమైనా ఒక్క 'క్లిక్కు'తో అద్భుత చిత్రం ఆవిష్కృతమవుతుంది. ఎన్నో స్మృతులు, మరెన్నో భావాలకు ప్రతిరూపంగా మదిలో మెదిలే జ్ఞాపకాలకు అపురూప 'చిత్రం'గా నిలుస్తుంది. సోమవారం అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక చిత్రాలు..

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ధర్పల్లి - సిరికొండ మార్గంలో కనువిందు చేస్తున్న చెట్టు



నందిపేట-శాపూర్ రోడ్డులో పచ్చని చెట్లు



గోదావరి తీరంలో జింకల సందడి



గోదావరి బ్యాక్‌వాటర్ జీజీనడ్కుడ వద్ద విదేశీ పక్షుల హొయలు

యథేచ్ఛగా ఆక్రమణలు!

- కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న మున్సిపల్ అధికారులు
- కోర్టు ఆదేశాలు అమలు చేయడంలో అలసత్వం
- మరోవైపు పాత ఆబాదీ భూములు గ్రీన్‌జోన్‌లో నమోదు
- బల్దియా భూములను మాత్రం పట్టించుకోని వైనం



బల్దియా స్థలంలో చేపట్టిన నిర్మాణం



భూమి మున్సిపాలిటీదంటూ పెట్టిన బోర్డు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ కార్పొరేషన్ భూములు కబ్జాకు గురవుతున్న సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కార్పొరేషన్‌లో అధికారుల తీరు అంతా మా ఇష్టం అన్నవిధంగా ఉంటోంది. తాము ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నవిధంగా వ్యవహారాలు నడిపిస్తున్నారని నగర ప్రజలు ఆరోపిస్తున్నారు. కాపాడాల్సిన మున్సిపల్ భూములను వదిలేయడం.. సదరు భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేసిన ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతుండటం గమనార్హం. నగరం నడిబొడ్డులో మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన పరిపాలన కార్యాలయానికి ఆనుకుని ఉన్న బల్దియా స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తుంటే దాన్ని అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికార యంత్రాంగం వాళ్లకే వత్తాసు పలుకుతుండడం విశేషం. గతంలో ఈ ప్రాంతంలోని భూమిని ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు కేటాయించారు. ఇలా కేటాయించిన భూమిలో ఇంకా 300 గజాలు మిగిలింది. ఈ భూమి విలువ రూ.కోట్లలో ఉంది. ఈ క్రమంలో ఈ భూమిని ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు 2018లో ఆక్రమించారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల సహకారంతో ఏకంగా మున్సిపాలిటీ హెచ్చరిక బోర్డును సైతం పీకేశారు. ఇందులో అక్రమంగా బోరు సైతం వేశారు. ఈ భూమి మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందినదని ఉన్న బోర్డును తొలగిస్తే క్రిమినల్ కేసు పెట్టాల్సిన అధికారులే వాళ్లకు మద్దతుగా నిలుస్తుండడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎప్పటికప్పుడు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటూ వస్తున్నారు.

మాస్టర్ ప్లాన్‌పై అత్యుత్సాహం

అసలు అమలులోనే లేని మాస్టర్ ప్లాన్ విషయంలో మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎల్లమ్మగుట్ట, గాజుల్‌పేట్, దుబ్బ, కోటగల్లీ తదితర ప్రాంతాల్లో పాత ఆబాదీలో ఉన్న భూములను గురించి తగిన విచారణ చేయకుండానే గ్రీన్‌జోన్‌లో నమోదు చేశారు. ఈ భూములు ప్రైవేటు వ్యక్తులకు చెందినవి. గ్రీన్‌జోన్‌లో నమోదు చేసే సమయంలో సదరు భూములకు సంబంధించి ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉంది. అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరించారు. కొత్త మాస్టర్ ప్లాన్ అమలులోకి రానప్పటికీ దీని పేరిట అనుమతులు ఇస్తున్నామంటూ దండుకుంటున్నారు. ఇక గ్రీన్ జోన్‌లో నమోదైన భూములను అందులోంచి తీసేసేందుకు గాను ముడుపులు తీసుకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయాలపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్ చేయగా స్పందించలేదు.

హైకోర్టు ఆదేశించినా..

ప్రభుత్వ భూమిపై కబ్జాపై ఓ వ్యక్తి ఆ భూమిపై న్యాయ పోరాటానికి దిగాడు. దీంతో హైకోర్టు ప్రభుత్వ భూమిలో నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశాలిచ్చింది. దీంతో మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి వదిలేశారు. కోర్టు ధిక్కరణ కింద కోర్టు మరోసారి ఇచ్చిన ఆదేశాల్లో సదరు భూమికి సంబంధించి పొజిషన్ చూపించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ నోటీసులు మాత్రమే ఇచ్చి వదిలేశారు. తీర్పును అమలు చేసే విషయంలో తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తుండడం విశేషం.

పాపన్నగౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి



కలెక్టరేట్‌లో పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈరవత్రి అనిల్, తదితరులు

నిజామాబాద్ అర్బన్ : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని వక్తలు అన్నారు. పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు వినాయకనగర్‌లో గల పాపన్నగౌడ్ విగ్రహానికి ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ మాట్లాడుతూ పోరాట యోధుడు పాపన్నగౌడ్ జయంతి అధికారికంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మొఘల్ రాజుల కాలంలో దౌర్జన్యాలు, అణిచివేతలకు వ్యతిరేకంగా సమర శంఖం పూరించిన ధీశాలి పాపన్న అని గుర్తు చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ మాట్లాడుతూ, మొఘల్ రాజులను ఎదురించి గోల్కొండ కోటను పాలించడం సర్వాయి పాపన్న ధైర్య సాహసాలను చాటుతోందన్నారు. గీత కార్మికులు సమష్టిగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, మేయర్ నీతూ కిరణ్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్, భూపతిరెడ్డి

అటవీ భూమిని ఆక్రమిస్తే చర్యలు



అటవీ భూములను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

సిరికొండ : అటవీ భూములను చదును చేస్తే చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని జంగిలోడి తండా సమీపంలో అటవీ భూములను ఆయన ఆదివారం పరిశీలించారు. పోడు పట్టాలు ఉన్న భూములను మాత్రమే సాగు చేయాలని సూచించారు. భూములకు సంబంధించిన నక్షాలను పరిశీలించారు. తహసీల్దార్ రవీందర్‌రావు, ఎఫ్ఆర్వో ఎంవీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల తనిఖీ

సిరికొండ రేంజ్ పరిధిలోని రావుట్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో అటవీ భూములను నిర్మల్ ఫ్లయింగ్ స్క్వాడ్ అటవీ క్షేత్రాధికారి అనిత తనిఖీ చేశారు. కబ్జాలపై ఆమె బృందం సభ్యులతో కలిసి విచారణ జరిపారు. ఆక్రమణకు గురైన భూముల వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా వేధింపులు

- ఏళ్ల తరబడి సేవలందించిన ఉద్యోగిని తిప్పుతున్న పిప్రి సొసైటీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఆర్మూర్ నియోజకవర్గంలోని పిప్రి సొసైటీలో ఏళ్ల తరబడి సేవలందించిన పి లక్ష్మణ్‌కు రిటైర్మెంట్ బెన్ఫిట్స్ ఇచ్చే విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆర్మూర్‌కు చెందిన లక్ష్మణ్ 36 ఏళ్ల పాటు పిప్రి సహకార సంఘం, డీసీసీబీలో పనిచేశాడు. సొసైటీలో సీఈవోగా, బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంటగా పనిచేసి 2016 జూలై 31న రిటైర్ అయ్యాడు. డీసీసీబీ నుంచి రావాల్సిన బెనిఫిట్స్ ఇచ్చినప్పటికీ, సొసైటీ నుంచి రావాల్సిన బెనిఫిట్స్ మాత్రం ఇవ్వడం లేదు. 2008 ఏప్రిల్‌లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రత్యేక జీవో ఇచ్చి సొసైటీ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వడంతో పాటు బ్యాంక్‌లో స్టాఫ్ అసిస్టెంట్‌గా పనిచేసే అవకాశం కల్పించింది. దీంతో లక్ష్మణ్ డీసీసీబీకి వెళ్లాడు. అయితే సొసైటీ వారు సేవలందించాలని కోరడంతో 2010 నవంబర్‌లో డిప్యుటేషన్ మీద పిప్రి సహకార సంఘానికి వచ్చాడు. 2016లో రిటైర్ అయ్యాడు. బ్యాంకులో చేసిన కాలానికి సంబంధించి రూ.53 వేల ఎరియర్స్ వెంటనే చెల్లించారు. సొసైటీ నుంచి గ్రాట్యుటీ రూ.1.53 లక్షలు రావాల్సి ఉంది. వాటిని ఇప్పటివరకు ఇవ్వలేదు. ఈ బెనిఫిట్స్‌ను ఇవ్వాలంటూ 2016లో అప్పటి డివిజనల్‌కోఆపరేటివ్ అధికారి మనోజ్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఇవ్వలేదు. ఇప్పటికీ తిప్పుతూనే ఉన్నారు. సొసైటీ ప్రస్తుత చైర్మన్, సీఈవో సైతం బెనిఫిట్స్ ఇవ్వాల్సిన అవసరం లేదని చెబుతుండడంతో లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

హాస్టళ్లలో బోగస్ దందా!

- విద్యార్థులు తక్కువ.. బిల్లులు ఎక్కువ
- ప్రతి నెల బియ్యం పక్కదారి
- ఏసీబీ దాడితో అధికారుల్లో గుబులు



కోటగల్లీ ఎస్సీ హాస్టల్‌లో తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు (ఫైల్)

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో బోగస్ బిల్లుల దందా సాగుతోంది. ఉన్న విద్యార్థుల కంటే ఎక్కువ మందిని చూపి బిల్లులు లేపుతున్నారు. గత మంగళవారం జిల్లా కేంద్రంలోని కోటగల్లీ బాలికల ఎస్సీ వసతి గృహంలో ఏసీబీ అధికారుల దాడితో ఈ డొల్లతనం బయటపడింది. కొన్నేళ్లుగా హాస్టళ్లలో వార్డెన్లు ఖజానాకు గండి కొడుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వసతి గృహాలపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. జిల్లాలోని హాస్టళ్లలో విద్యార్థుల హాజరు శాతాన్ని ఎక్కువగా చూపుతూ ప్రతి ఏట లక్షలాది రూపాయలను కాజేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో అవినీతి అక్రమాలను విచారణ చేసి గుర్తించిన అధికారులు ఒక్కొక్క వసతి గృహం పరిస్థితిలను తెలుసుకొని దాడులు చేయనున్నట్లు తెలిసింది.

లెక్కల్లో మాయ

హాస్టళ్లలో వార్డెన్లు విద్యార్థుల లెక్కల్లో మాయ చేస్తున్నారు. ఉన్న వారి కంటే ఎక్కువ మందిని నమోదు చేసి బిల్లులు కాజేస్తున్నారు. జిల్లాలోని ఓ బీసీ వసతి గృహంలో 30 మంది విద్యార్థులుండగా 90 మంది ఉన్నట్లు అధికారులు నివేదికలు చూపుతున్నారు. మరో హాస్టల్‌లో 25 మంది ఉండగా 70 మంది విద్యార్థుల సంఖ్యను చూపుతున్నారు. ఓ ఇన్‌చార్జి అధికారి ఉన్న వసతి గృహంలో 40 మందికి 82 మంది విద్యార్థుల సంఖ్యను చూపుతున్నారు.

- ఆర్మూర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో దాదాపు 60 మంది విద్యార్థులను ఎక్కువగా చూపుతున్నారు. ఆ బియ్యాన్ని బయట విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో ఓ అధికారి విద్యార్థుల సంఖ్యను రెండింతలుగా చూపుతూ వచ్చిన బియ్యాన్ని రేషన్ డీలర్‌కు విక్రయిస్తున్నారు.
- మూడు హాస్టళ్లకు ఇన్‌చార్జిగా ఉన్న ఓ అధికారి విద్యార్థులకు గుడ్లు, చికెన్ పెట్టడం లేదు. జిల్లా కేంద్రంలోని మరో అధికారి 46 మంది విద్యార్థులు ఉండగా ప్రతి ఏటా వందకు మంది విద్యార్థుల పేరిట బిల్లులు నమోదు చేస్తున్నారు.

జిల్లాలో హాస్టళ్ల వివరాలు

కమ్యూనిటీ	హాస్టళ్లు	విద్యార్థులు
ఎస్సీ	42	3,556
బీసీ	33	2,856
ఎస్టీ	08	1,500

పర్యవేక్షణ కరువు

హాస్టళ్లలో వార్డెన్ల కొరత వేధిస్తోంది. దీంతో ఒక్కొక్కరికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే వార్డెన్లు విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపుతూ బిల్లును పొందుతున్నారు. ఇన్‌చార్జీలుగా కొనసాగడంతో కొన్ని రోజులే కదా అంటూ తప్పుడు బిల్లులు నమోదు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని అధికారుల పాత్ర కూడా ఇందులో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో ఎంతమంది ఉన్నారో జిల్లా అధికారుల వద్ద నివేదిక ఉంటుంది. అలాగే తనిఖీలు చేపట్టడం, పరిశీలించడం ద్వారా పూర్తిస్థాయి అవగాహన ఉంటుంది. కానీ ఇవేమీ పరిశీలించకుండా వసతి గృహం అధికారులు సమర్పించిన బిల్లులను మంజూరు చేస్తున్నారు. అలాగే ప్రతి ఏటా ఆడిట్ కొనసాగుతున్నా లోపాలు బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో ఓ వసతి గృహం అధికారి ఫిబ్రవరిలో ఏడాదికి సంబంధించి రూ.9,50,000 వంట బిల్లులు పొందారు. దీనికి అనుగుణంగా విద్యార్థుల సంఖ్య అక్కడ లేకపోవడం గమనార్హం.

విచారణ జరపాలి



హాస్టళ్లలో జరుగుతున్న అవినీతిపై ఏసీబీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల సంఖ్యని ఎక్కువగా చూపుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు.

– రాజేశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

తనిఖీలు చేపట్టాలి



వసతి గృహాలపై పర్యవేక్షణ లేకపోవడంతోనే వార్డెన్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. జిల్లా అధికారులు తనిఖీలు చేపడితే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయి.

– లాల్‌సింగ్, టీవీయూవీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

చర్యలు తీసుకుంటాం

జిల్లాలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతాం. విద్యార్థులకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేస్తాం. ఎక్కడైన విద్యార్థుల కంటే ఎక్కువ బిల్లులు సమర్పిస్తే చర్యలు తీసుకుంటాం.

– నిర్మల, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి

క్లుప్తంగా

రాఖీ పండుగను ఆనందంగా జరుపుకోవాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


నిజామాబాద్‌అర్బన్: జిల్లా ప్రజలు సోమవారం నిర్వహించే రాఖీ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ సోదరీమణులకు ఏ ఆపద రాకుండా అండగా నిలబడతామని సోదరులు భరోసాను అందించడం ఈ పండుగ విశిష్టత అని గుర్తు చేశారు. ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమి వేడుక ప్రజల మధ్య ఆత్మీయతను మరింతగా పెంపొందించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయికి క్రీడాకారుల ఎంపిక



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అభ్యాస స్కూల్‌లో అండర్-11 విభాగంలో బాలబాలికలకు రాష్ట్రస్థాయి ఎంపికకు జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. అనంతరం విజేతలకు ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జి.వెంకటేశ్వర రావు, విక్టరీ హైస్కూల్ కరస్పాండెంట్ రాంచందర్‌రావు ట్రోఫీలు, ప్రశంసపత్రాలు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో బి అభిజిత్, కె నాగజోష్నిక(అభ్యాస దస్కూల్), అతర్వ తొర్వె, సహస్ర రాథోడ్(పెసిడెన్సి హై స్కూల్) ఉన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి రమేశ్, ఆర్బిటర్ నవ్యకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎల్బ్రజ్ పర్వతాన్ని అధిరోహించిన మారుతి



నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన పర్వతారోహకుడు అర్మూర్ మారుతి ఆదివారం మరో ఘనత సాధించాడు. గతంలో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన మారుతి ఇటీవల యూరప్‌ఖండంలోని రష్యా దేశంలోని ఎత్తయిన ఎల్బ్రజ్ పర్వతాన్ని అధిరోహించాలనుకున్నారు. ఆదివారం ఆ పర్వతాన్ని అధిరోహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌రూరల్: బోందెం చెరువు ఆక్రమణలపై కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగర నడిబొడ్డున ఆక్రమణలు కొనసాగుతుంటే మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో పెద్ద ఎత్తున ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నాయని కలెక్టర్ దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

ఫోన్ పోతే ఫిర్యాదు చేయండి

ఖలీల్‌వాడి: సెల్‌ఫోన్ పోతే బాధితులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని నిజామాబాద్ టౌన్ సీఐ నరహరి ఒక ప్రకటనలో తెలిపారు. మొబైల్ ఫోన్ పోయిన, చోరీకి గురైనా సీఈఐఆర్‌లో అప్లికేషన్‌లో వివరాలు నమోదు చేస్తే, ఫోన్‌ను రికవరీ చేయవచ్చన్నారు. ఎవరికైనా సెల్‌ఫోన్‌లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాలని సూచించారు. ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేసి వివరాలు తెలపాలన్నారు.



నిజామాబాద్‌లోని కుమార్‌గల్లీలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



కామారెడ్డిలో..

అనుబంధాల రాఖీ

- నేడు రక్షాబంధన్
- జోరుగా రాఖీ విక్రయాలు
- సందడిగా మారిన మార్కెట్లు

నిజామాబాద్‌రూరల్/ మోర్తాడ్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ. ఈ పండుగను శ్రావణ పౌర్ణమి అని కూడా అంటారు. తల్లిదండ్రుల తర్వాత అంతటి స్థానం ఉన్న అన్న లేదా తమ్ముడికి రాఖీ కట్టేందుకు తోబుట్టువులు తల్లిగారింటికి చేరుకుంటున్నారు. దీంతో బస్టాండ్ల వద్ద సందడి నెలకొన్నది. రక్షాబంధన్ సందర్భంగా మార్కెట్‌లో దుకాణాలు భారీగా వెలిశాయి. రాఖీలను కొనుగోలు చేసేందుకు మహిళలు బారులు తీరారు. మట్టి రాఖీలు, చిన్నారుల కోసం చోటోభీం, హనుమాన్, మిక్కీమౌస్ వంటివి అందుబాటులో ఉన్నాయి. స్వీట్లు, బట్టల దుకాణాలు కిటకిటలాడాయి. ఆర్టీసీ అధికారులు పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

కామారెడ్డిలో..

కామారెడ్డిటౌన్: రాఖీ పండుగ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం పండుగ సందడి నెలకొంది. సుభాష్‌రోడ్, మాయాబజార్, సిరిసిల్లారోడ్, కొత్త బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు ప్రత్యేక స్టాళ్లతో రాఖీలను విక్రయాలు చేపట్టారు. రూ. 10 నుంచి రూ. వెయ్యికి పైగా రాఖీల ధరలు పలికాయి.



నిజామాబాద్‌లో ఓ దుకాణం ఎదుట మహిళలు





వివిధ డిజైన్లలో అందుబాటులో ఉన్న రాఖీలు



కామారెడ్డి పట్టణ కేంద్రంలో..





శిఖం భూమి వెనుక కథలెన్నో..

- రూ.70 వేలు నుంచి రూ. లక్షన్నర వరకు వసూలు చేసిన నేతలు
- ప్లాట్లు అమ్మిన వారిపై బాధితుల ఫిర్యాదు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని బొందం గడ్డ శిఖం భూమి కబ్జా వెనుక కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పలువురు స్థానిక నేతలు నకిలీ పట్టాలు సృష్టించి పేదలకు వాటిని విక్రయించినట్లు సమాచారం. వంద గజాల ప్లాటుకు రూ. 2 లక్షల వరకు సదరు వ్యక్తులకు ముట్టజెప్పినట్లు బాధితులు పేర్కొంటున్నారు. శనివారం ఉదయం బొందం గడ్డ చెరువు శిఖం భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. కాగా 28 మంది బాధితులు కుటుంబాలతో కలిసి ఆదివారం మధ్యాహ్నం నగరంలోని ఐదోటౌన్ పీఎస్ ఎదుట బైఠాయించారు. అనంతరం ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులతో కలిసి తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కమల, నరేశ్, గోపాల్, మహమ్మద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్రావు పేర్కొన్నారు.

రూ.70 వేల నుంచి రూ. లక్షన్నర వసూళ్లు

భారతీనగర్ కాలనీ దగ్గర ఉన్న చెరువు శిఖం భూమిలో 70 నుంచి 100 గజాల వరకు ప్లాట్లను ఏర్పాటు చేసి రూ. 70 వేల నుంచి రూ. లక్షన్నర వరకు విక్రయించారు. వీటికి పట్టాలను కూడా ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. ఈ స్థలంలో రేకులషెడ్లు, ఇంటి నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు శిఖం భూములని ఇండ్లను కూల్చివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు,



ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

రాజకీయ ప్రమేయంపై ఆరా..

రాజకీయ నాయకుల ప్రమేయంతోనే శిఖం భూములు ప్లాట్లుగా మార్చి అమ్మకాలు సాగించారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టాలు ఎక్కడి నుంచి వచ్చాయి.. ఫోర్జరీ, ఇతర కోణాల్లో పోలీసులు విచారణ చేపడుతున్నారు. రూ. 70 వేల నుంచి రూ.లక్షన్నర వసూళ్లు చేసిన మధ్యవర్తులు వాటాలను ఎవరెవరికి ఇచ్చారనే కోణంలో వివరాలు సేకరిస్తున్నారు. నాగారం, దొడ్డికొమురయ్య కాలనీ, ధర్మపురి హిల్స్, సారంగపూర్‌లో 70 గజాల చొప్పున భూములను అమ్మకాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. నాగారంలోని వెయ్యి గజాల భూమిలో ఆరునెలల క్రితం ఒకరు గోడలు నిర్మించి ఇంటి నిర్మాణం చేపట్టగా ఇందుకు కార్పొరేషన్ నుంచి ఇంటి బిల్లు తీసుకున్నట్లు తెలిసింది. దీని విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందని తెలుస్తోంది. ఇక్కడ ఉన్న ప్రభుత్వ భూములు, ఫారెస్ట్ భూముల్లో మట్టి తవ్వకాలు సాగించి ఆ ప్రాంతాన్ని చదును చేసి ప్లాట్లు అమ్మకాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు.

రికార్డ్ రూం కాలిపోవడంతో..

జిల్లా గ్రంథాలయం వద్ద ఉన్న తహసీల్ కార్యాలయం సుమారు 12 ఏళ్ల క్రితం కాలిపోయింది. అందులో రికార్డు రూమ్ కూడా ఉంది. దీంతో జిల్లా కేంద్రంలోని భూముల వివరాలకు సంబంధించిన పలు రకాల డాక్యుమెంట్లు కాలిపోవడంతో ఆక్రమాల గురి ప్రభుత్వ భూములపై పడింది. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములను ఆక్రమించి వాటికి పాత పట్టాలను అందించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం నకిలీ పట్టాలు ఇచ్చి సొమ్ము చేసుకున్న వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా దుబ్బ ప్రాంతంలో ప్రభుత్వ భూమికి పట్టాలు ఇచ్చి ఒక్కొక్కరి నుంచి రూ. 2 నుంచి రూ. 3 లక్షల వరకు వసూళ్లు చేసిన ఘటన ఉంది.

రైతు రుణమాఫీ బూటకం

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం రైతు రుణమాఫీ పేరిట రైతులను మోసం చేస్తోందని అదంతా ఓ బూటకమని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎక్కడికి వెళ్తే అక్కడి దేవుళ్లపైన ఒట్టువేసి రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారని కానీ ఏ సొసైటీకి వెళ్లినా 40 శాతానికి మించి రుణమాఫీ కాలేదని అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావును రాజీనామా చేయాలని వ్యాఖ్యలు చేయడం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ గుండాలతో దాడి చేయించడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారాయని, పోలీసులు కాంగ్రెస్ పార్టీకి పని చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని బెదిరింపులకు పాల్పడినా బీఆర్ఎస్ రైతుల పక్షాన ప్రతి పక్ష పార్టీగా నిలబడుతుందని అన్నారు. బీఆర్ఎస్ బీజేపీలో విలీనం ప్రచారం మాత్రమేనని కొట్టిపారేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

క్రైం కార్నర్

గోదావరిలో మునిగి విద్యార్థి మృతి



సాయికుమార్ మృతదేహం

రెంజల్: ప్రమాదవశాత్తు కందకుర్తి వద్ద గోదావరి నదిలో మునిగి ఓ విద్యార్థి ఆదివారం మృతి చెందాడు. బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన దేవర్ల సాయికుమార్(22) స్నేహితుడైన ఉదయ్‌కిరణ్‌తో కలిసి గోదావరి నదిలో స్నానాలకు వచ్చారని ఎస్సై సాయన్న తెలిపారు. సాయికుమార్‌కు ఈత రాక నీట మునిగి మృతిచెందినట్లు పేర్కొన్నారు. వెంట వచ్చిన స్నేహితుడు సాయికుమార్ అన్న రాజశేఖర్‌కు సమాచారం అందించడంతో ఆయన అక్కడికి చేరుకునే సరికి నీట మునిగి ఉన్నట్లు పేర్కొన్నారు. స్థానికుల సమాచారంతో గోదావరి వద్దకు చేరుకుని స్థానిక జాలార్లతో వెతికించగా మృతదేహం లభ్యమైంది. అన్న రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

రైలు నుంచి జారి పడి యువకుడు ..

నవీపేట/ఖలీల్‌వాడి: మండలంలోని ఫకీరాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి ఓ యువకుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయరెడ్డి ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బోధన్‌కు చెందిన అన్నాచెల్లెల్లు బాలాజీ(33), పూజ పర్బణి రైలులో నాందేడ్‌కు వెళ్తున్నారు. ఫుట్‌పాత్‌పై నిలబడి ఉన్న బాలాజీ రైలు కదులుతుండగా కిందపడ్డాడని రైలులో ఉన్న ప్రయాణికులు పేర్కొన్నారు. గమనించిన పైలట్ రైలును ఆపి అదే రైలులో బాసరకు తీసుకెళ్లారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

దుబాయిలో కుర్నాపల్లి వాసి..



తేజేశ్‌గౌడ్(ఫైల్)

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లికి చెందిన తేజేశ్‌గౌడ్(24) దుబాయిలో ఈ నెల 16న అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామస్తులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తేజేశ్‌గౌడ్ ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం దుబాయికి వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న ప్రాంతంలో అనారోగ్యానికి గురి కాగా 16న మృతి చెందాడు. మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించేలా కుటుంబీకులు కృషి చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్: మండల శివారులో అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు తహసీల్దార్ విఠల్ ఆదివారం పేర్కొన్నారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం రాత్రి రెండు, ఆదివారం ఉదయం మరో రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా గ్రామాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఆర్ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) దగ్గర బాసర రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కుటుంబీకులు బాసరకు కారులో వస్తుండగా అబ్బాపూర్(ఎం) వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా నిజామాబాద్‌కు తరలించారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

తాడ్వాయి: తన భర్త చెప్పిన మాట వినలేదని ఓ వివాహిత క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఫిర్మాయికుంట తండాలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మెగావత్ శాంతి(32) మెగావత్ అశోక్ భార్యభర్తలు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ విషయంలో భార్యాభర్తల మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతుండేవి. ఈ నెల17న శాంతి తన కాళ్లకడియాలు పెద్దవిగా ఉన్నాయని చిన్నవిగా చేయించేందుకు కామారెడ్డికి వెళ్దామని భర్తతో చెప్పింది. దీంతో అశోక్ తనకు పని ఉందని తర్వాత వెళ్దామని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తన భర్త చెప్పిన మాట వినలేదని మనస్తాపానికి గురైన శాంతి క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందవుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి మూడ్‌మాణిక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ టోర్నీ



పోటీల్లో తలపడుతున్న నిజామాబాద్, మహబూబ్‌నగర్ క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం:ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో డాక్టర్ కవిత రెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న పదవ మహిళల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో నిజామాబాద్ జిల్లా జట్టు సెమీ ఫైనల్‌కు చేరింది. మూడో రోజైన ఆదివారం ఏఆర్ ఏసీపీ నాగయ్య, సీనియర్ క్రీడాకారుడు జావీద్ కార్యక్రమానికి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో జిల్లా జట్టు సెమీస్‌కు వెళ్లినట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మీర్ ఫారుకు మహమ్మద్, జావేద్ తెలిపారు. జిల్లా జట్టుకు కోచ్ గా భక్తపాల్, మేనేజర్‌గా మహమ్మద్ అజ్మత్ ఖాన్, అసిస్టెంట్ కోచ్‌గా గొట్టపాటి నాగరాజు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఖలీద్, గిరి, సంయుక్త కార్యదర్శి అన్వర్ సురేష్, నరేశ్, ఇతర జిల్లాల కార్యదర్శులు వినోద్ ఆదర్శ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న రంగారెడ్డి, మహబూబ్‌నగర్ క్రీడాకారులు

ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టుపై నిజామాబాద్, వనపర్తి జట్టుపై మెదక్, మహబూబ్‌నగర్ జట్టుపై రంగారెడ్డి, కరీంనగర్ జట్టుపై నల్గొండ, నల్గొండ జట్టుపై ఖమ్మం, కరీంనగర్ జట్టుపై రంగారెడ్డి జట్లు గెలుపొందాయి. సెమీ ఫైనల్‌కు నిజామాబాద్, ఖమ్మం, మెదక్, నల్గొండ జట్లు చేరాయి. మొదటి సెమీఫైనల్‌లో మెదక్, నల్గొండ జట్లు తలపడగా రెండో సెమీఫైనల్‌లో నిజామాబాద్, ఖమ్మం జట్లు తలపడనున్నాయి.

ఎస్సారెస్పీలో 50 టీఎంసీలకు చేరిన నిల్వ

ఎగువ నుంచి కొనసాగుతున్న వరద

బాల్కొండ: ఎస్సారెస్పీలో నీటి నిల్వ 50 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 15 వేల క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ప్రస్తుత సంవత్సరం వరద అనుకున్నంతగా వచ్చిచేరడం లేదు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు 32 టీఎంసీల వరద వచ్చి చేరింది. గరిష్ఠంగా 56 వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే ప్రస్తుత ఏడాది వచ్చి చేరింది. దీంతో ప్రాజెక్ట్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకు గాను ప్రాజెక్టులో ప్రస్తుతం 50 టీఎంసీలకు మాత్రమే నీటి నిల్వ చేరింది. మరో రెండు నెలలు ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వచ్చి చేరే అవకాశం ఉండటంతో ప్రాజెక్ట్ నిండుకుండల మారే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఒక పంటకు భరోసా..

ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో ఉన్న నీటి నిల్వ ఆధారంగా వానాకాలం పంటకు మాత్రమే భరోసా వచినట్లు భావించవచ్చు. ప్రాజెక్టులో కనీసం 56 టీఎంసీల నీరు నిల్వ ఉంటేనే ఒక పంటకు భరోసా ఉంటుంది. కానీ ఇంకా 6 టీఎంసీల నీరు తక్కువగానే ఉంది. కానీ వర్షాకాలం కావడంతో ఎగువ ప్రాంతాల నుంచి ఎంతో కొంత వరద వచ్చే అవకాశం ఉండటంతో ఒక పంటను గట్టెక్కించవచ్చు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు ఎగువ ప్రాంతాల నుంచి 48.5 టీఎంసీల వరద వచ్చి చేరింది. ప్రాజెక్ట్ నుంచి వానాకాలం పంటల కోసం కాలువ ద్వారా 7 టీఎంసీల నీటిని వదిలారు. కాలువల ద్వారా ఈ నెల 7 నుంచి నీటి విడుదలను ప్రారంభించారు. కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టకుండా ఉంచితే ఇప్పటికీ ప్రాజెక్టు నీటి నిల్వ 57 టీఎంసీలు దాటి ఉండేది. ఇప్పటి వరకు 7 టీఎంసీల నీటి వినియోగం జరగింది. దీంతో వానాకాలం పంటలకు డోఖా లేనట్లే అని పలువురు పేర్కొంటున్నారు.

కాలువల ద్వారా నీటి విడుదల

ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 4500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, ఆవిరి రూపంలో 522, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. లక్ష్మికాలువ ద్వారా నీటి డిమాండ్ లేక పోవడంతో నీటి విడుదలను నిలిపివేశారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1081.80(50 టీఎంసీలు)అడుగుల నీరు ఉందని అధికారులు పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సుభాష్‌నగర్: నగరంలోని వివేకానంద విద్యాలయంలో 2001-02కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని కపిల హోటల్‌లో నిర్వహించారు. అందరూ ఒకే చోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు. చిన్నప్పుడు తరగతి గదుల్లో చేసిన అల్లరి, చిలిపి చేష్టలను గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు.

అనంతరం విద్యాబుద్ధులు నేర్పి న గురువులు, ప్రిన్సిపాల్ రవికాంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోపి, ప్రశాంత్, సురేష్, రాహుల్, ప్రభుదాస్, విజయ్‌కాంత్, యోగేశ్, శేఖర్‌రెడ్డి, రజితారెడ్డి, సంధ్య, పెద్ది చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు వేధిస్తున్నారంటూ ఫ్లెక్సీ ఏర్పాటు

ఖలీల్‌వాడి: పోలీసులు తమ దుకాణం ఎదుట నిత్యం తనిఖీలు చేపడుతూ వేధిస్తున్నారంటూ ఓ స్వీటు దుకాణ యజమాని ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో ఉన్న ఉన్న ఢిల్లీవాలా స్వీట్ హోమ్ దగ్గర పోలీసులు ఆదివారం, సోమవారం ఇలా నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో దుకాణ యాజమాన్యం పండుగ నేపథ్యంలో తమ దుకాణం ఎదుట తనిఖీలు చేపట్టవద్దని పోలీసులను కోరారు. పోలీసులు వినకపోవడంతో దుకాణ యాజమాన్యం వెంటనే షాపు మూసివేసి పోలీసులు వేధిస్తున్నారని పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేసింది. దీంతో అక్కడ ఉన్న వారు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. ఈ విషయాన్ని గమనించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు సమాచారం. పండుగల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు ఏమిటని పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో పోలీసులు తనిఖీలను నిలిపివేయడంతో దుకాణ యాజమాన్యం షాప్‌ను తెరిచింది.



స్వీట్ హోం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మద్యం మత్తులో గొంతుకోసుకున్న యువకుడు

బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన అల్లం కేశవ్ అనే యువకుడు ఆదివారం మద్యం మత్తులో బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. రక్తస్రావం అవుతుండటంతో నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే బీర్కూర్ ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పోలీసులు బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ గొడవల నేపథ్యంలో గొంతు కోసుకున్నట్లు బాధితుడు తెలిపాడని పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు సదరు యువకుడి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టగా కుటుంబ కలహాలతో గత మూడు రోజులుగా ఇలాగే ప్రవర్తిస్తున్నట్లు వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితుడికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

డ్రెయినేజీలో పసికందు మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం పక్కన ఉన్న మురికి కాలువలో నవజాత శిశువు మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. స్థానికులు ఒకటో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని వెలికి తీసి జీజీహెచ్‌కు తరలించారు. శిశువును రైల్వేలో వచ్చి ఇక్కడ పడేసి వెళ్లారా లేదా రైల్వే పరిసర, నగరానికి చెందిన వారు ఎవరైనా పడేసి వెళ్లార అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరిసర ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు ఏఎస్సై రాజు ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన ఓ మహిళ ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.